# సాక్షి
## భద్రాద్రి కొత్తగూడెం

శనివారం ׀ 30 ׀ నవంబర్ ׀ 2024




### ముగిసిన ప్రస్థానం

1967లో ఏర్పడ్డ సీపీఐ(ఎంఎల్) గ్రూపు అజ్ఞాత దళాల ప్రస్థానం పూనెం బాబు అలియాస్ రమేశ్ అరెస్ట్‌తో ముగిసింది. 8లో



### ఉర్సుకు వేళాయె..

మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్న సత్యనారాయణపురం దర్గాలో నేటి నుంచి ఉర్సు ఉత్సవాలు నిర్వహించనున్నారు. 10లో

### వాతావరణం

గరిష్టం / కనిష్టం 28° / 22°

జిల్లాలో శనివారం మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. తెల్లవారు జామున, రాత్రి వేళ చలి ప్రభావం ఉంటుంది.

## న్యూస్‌రీల్

### స్వర్ణకవచధారణలో రామయ్య



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం అంతరాలయంలోని మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై దర్శనమిచ్చారు. బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విష్వక్సేనపూజ, పుణ్యావాచనం చేశారు. అనంతరం నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. శుక్రవారం సందర్భంగా శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో అమ్మవారికి అభిషేకం, పూజలు చేశారు.

### పెద్దమ్మతల్లి ఆలయంలో రుద్రహోమం



రుద్రహోమం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి ఆలయంలో శుక్రవారం రుద్రహోమం పూజలు వైభవంగా నిర్వహించారు. మండల పరిధిలోని శ్రీకనక దుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో మాసశివ రాత్రిని పురస్కరించుకుని యాగశాలలో రుద్ర హోమం, పంచామృతాభిషేక పూజలు జరిపారు. ముందుగా మేళతాళాలు, వేదమంత్రాలతో స్వామివారిని అర్చకులు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం మండపారాధన, గణపతి పూజల అనంతరం రుద్ర హోమం గావించారు. చివరన పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు.

### రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్ట్‌కు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓ స్వర్ణజ్యోతి తదితరులు

మణుగూరు టౌన్: మండలంలోని రామానుజవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి టాలెంట్ టెస్ట్‌కు ఎంపికయ్యారు. గురువారం కొత్తగూడెం సింగరేణి హైస్కూల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో ప్రథమస్థానం సాధించారని, ఆదిలాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి టెస్ట్‌కు ఎంపికయ్యారని హెచ్ఎం యశోద తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థినులు తేజస్వి, హేమశ్రీ, హర్షిణిలను శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఎంఈఓ స్వర్ణజ్యోతి అభినందించారు. రమేశ్, వనిత, భుజంగరావు, కోటేశ్వరరావు, సురేశ్ పాల్గొన్నారు.

### మెడికల్ బోర్డు నిర్వహించని సింగరేణి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ ఈ నెలలో మెడికల్ బోర్డు నిర్వహించకపోవడంతో కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంస్థలో పనిచేస్తూ అనారోగ్యానికి గురైన కార్మికుల స్థానంలో వారి వారసులకు ఉద్యోగ అవకాశం కల్పిస్తున్నారు. ఇందుకోసం ప్రతినెలా సింగరేణి ప్రధానాస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి, మెడికల్ అన్‌ఫిట్ అయిన కార్మికులను గుర్తిస్తున్నారు. అయితే వందల సంఖ్యలో దరఖాస్తులు ఉన్నా ఈ నెలలో మెడికల్ బోర్డ్ నిర్వహించకపోవడంపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో నెలకు మూడుసార్లు మెడికల్ బోర్డు సమావేశాలు నిర్వహించి, సుమారు 600 మందిని అన్‌ఫిట్ చేశారని, ఆ తర్వాత నెలకు రెండు సార్లు నిర్వహించారని పేర్కొంటున్నారు. ఈ నెలలో ఒక్కసారి కూడా మెడికల్ బోర్డు నిర్వహించ లేదని కార్మికులు ఆరోపిస్తున్నారు.

### విదేశీ విద్యానిధి పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంమయూరిసెంటర్: 2024 విద్యాసంవత్సరం(ఫాల్ సీజన్)కు గాను విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే మైనార్టీ అభ్యర్థులు విద్యానిధి పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఖమ్మం మైనారిటీ సంక్షేమ అధికారి కస్తాల సత్యనారాయణ సూచించారు. డిగ్రీ, పీజీల్లో 60 శాతం మార్కులు పొందిన వారు అర్హులని, డిసెంబర్ 1నుండి 31వ తేదీ లోపు ఈపాస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసిన కాపీని జనవరి 10వ తేదీలోగా కలెక్టరేట్‌లో అందజేయాలన్నారు.

# ల్యాండ్ బ్యాంక్ కావాలి



స్థల సమస్యతో మెడికల్ కళాశాలకు, సర్వజన ఆస్పత్రికి కిలోమీటర్ల దూరంలో నిర్మిస్తున్న ట్రామా కేర్ సెంటర్

**ప్రభుత్వానికి కత్తిమీద సాములా మారిన భూసేకరణ**

- జిల్లాలో సర్కారు సంస్థల ఏర్పాటుకు స్థలం కరువు
- నిరుపయోగంగా పరిశ్రమలకు కేటాయించిన భూములు
- పడావుగా ఉన్నా స్వాధీనం చేసుకోని జిల్లా అధికారులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో ఇథనాల్ ఫ్యాక్టరీ, వికారాబాద్ జిల్లా లగచర్లలో ఫార్మా కంపెనీల స్థాపనకు భూసేకరణలో ప్రభుత్వం విఫలమైంది. స్థానికుల నుంచి వ్యతిరేకత రావడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. మైదాన ప్రాంతాల్లోనే భూసేకరణ కత్తి మీద సాముగా మారితే, ఏజెన్సీ ఏరియాలో అది మరింత కష్టంగా ఉంటుంది. ఇక్కడ రైతుల్లో ఎక్కువ మంది గిరిజనులే ఉన్నారు. భూములు కూడా అటవీ శాఖవే అధికంగా ఉంటాయి. ప్రస్తుత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్ అవసరాల కోసం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

**స్థలంలేక ఇబ్బందులు..**

ప్రభుత్వ స్థలాల విషయంలో సరైన ప్రణాళిక లేకపోవడంతో ఎదురవుతున్న ఇబ్బందులకు కొత్తగూడెం మెడికల్ కాలేజీ, బోధనాసుపత్రులే ప్రత్యక్ష ఉదాహరణలుగా నిలుస్తున్నాయి. స్థల సమస్య కారణంగా మెడికల్ కాలేజీ ఒక దగ్గర, సర్వజన ఆస్పత్రి మరో చోట, మెటర్నిటీ ఆస్పత్రి ఇంకో చోట ఉన్నాయి. ఏడాది క్రితం జిల్లాకు 50 పడకల సామర్థ్యం కలిగిన ట్రామా కేర్ సెంటర్ మంజూరైతే ఎక్కడ నిర్మించాలనే అంశంపై మల్లగుల్లాలు పడాల్సి వచ్చింది. చివరకు సూపర్ స్పెషాలిటీ వైద్యులు, రోగ నిర్ధారణ కేంద్రాలు, ఆధునిక ఆరోగ్య పరీక్షలు చేసే ల్యాబ్‌లకు దూరంగా రామవరం ఎంసీహెచ్ క్యాంపస్‌లో ట్రామాకేర్ సెంటర్ కట్టాల్సి వచ్చింది. అంతకుముందు ఐడీఓసీ (కలెక్టరేట్), ఇంజనీరింగ్ కాలేజీ వంటి ప్రముఖ నిర్మాణాలూ రిజర్వ్ ఫారెస్టు స్థలంలోనే చేపట్టాల్సి వచ్చింది. వాటికి అనుబంధంగా మరే అభివృద్ధి పనులకు ఆస్కారం లేకుండా పోయింది.

**విమానాశ్రయం, సేంద్రియ పరిశ్రమ వస్తే..**

జిల్లాలో విమానాశ్రయం నిర్మాణానికి ప్రభుత్వం చకచకా అడుగులు వేస్తోంది. ఎయిర్‌పోర్టు వస్తే సిబ్బందికి క్వార్టర్లు నిర్మించాల్సి వస్తుంది. సేంద్రియ వ్యవసాయానికి సంబంధించి జాతీయస్థాయి పరిశ్రమ జిల్లాకు మంజూరు కాబోతుందని మంత్రి తుమ్మల ఇటీవల ప్రకటించారు. అంతకుముందు యూనివర్సిటీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ ఏర్పాటు కోసం సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఆటోనగర్ నిర్మాణానికి ప్రణాళికలు ఉన్నాయి. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు నిర్మించాల్సి ఉంది. భద్రాచలంలో ఎయిమ్స్ నిర్మించాలని ఎంపీ బలరాంనాయక్ విజ్ఞప్తి చేశారు.

**పరిశ్రమలకని కేటాయించిన స్థలాలు కబ్జా..**

సింగరేణి బొగ్గు గనుల కారణంగా జిల్లాలో పారిశ్రామిక రంగం ఊపు మీద ఉన్నప్పుడు పరిశ్రమలు స్థాపిస్తామంటూ అనేక మంది స్థలాలను తీసుకున్నారు. నిబంధనల ప్రకారం స్థలం కేటాయించిన తర్వాత నాలుగేళ్లలో పరిశ్రమలో సంబంధిత ఉత్పత్తులు బయటకు రావాల్సి ఉంది. లేని పక్షంలో సదరు స్థలాన్ని ఆయా కంపెనీల నుంచి వెనక్కి తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉంది. ఖరీదైన స్థలాలు నిరుపయోగంగా పడి ఉన్నా స్వాధీనం చేసుకోవడంలో జిల్లా యంత్రాంగం, టీఎస్ఐఐసీ పట్టింపు లేనట్టుగా ఉంటున్నాయి. మరోవైపు పరిశ్రమల పేరుతో కేటాయింపులు జరిగిన స్థలంలో యాక్టివిటీ లేకపోవడంతో చాలా చోట్ల ఇవి కబ్జాలకు గురవుతున్నాయి.

**మచ్చుకు కొన్ని..**

- పాల్వంచ పట్టణంలో సుమారు 36 ఎకరాల వరకు భూములను దశాబ్దాల క్రితం పరిశ్రమలను స్థాపిస్తామని చెప్పి ఓ రాజకీయ నేత బినామీకి కేటాయించారు. దశాబ్దాలు గడిచినా ఇప్పటివరకు ఫ్యాక్టరీ శంకుస్థాపన కూడా జరగలేదు.
- పాల్వంచ పట్టణంలోని 444 సర్వే నంబర్‌లో స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ పేరుతో అనేక మందికి ప్రభుత్వం స్థలాలు కేటాయించింది. ఈ భూముల్లో కుటీర పరిశ్రమలు పెట్టిన దాఖలాలు ఎక్కడా లేవు.
- కొత్తగూడెంలో కిన్నెర స్టీల్స్, బేరింగ్ కెమికల్స్ ఫ్యాక్టరీల పేరుతో గతంలో భారీగా భూములు తీసుకున్నారు. ఇప్పుడా పరిశ్రమలు మూత పడిపోయాయి. అక్కడ ఎటువంటి యాక్టివిటీ లేదు. కానీ ఆ స్థలాలు నిరుపయోగంగా ఉన్నాయి.
- కొత్తగూడెం ఇండస్ట్రియల్ ఏరియాలోనూ గతంలో కేటాయింపులు జరిగిన అనేక స్థలాలు పడావుగా పడి ఉన్నాయి.

# దళిత రైతుల కలవరం

- రెడ్డిగూడెంలో 40 ఎకరాల కాందిశీకుల భూములు
- శత్రు ఆస్తుల లెక్కలో భాగంగా ఇటీవల సర్వే
- అనేక ఏళ్లుగా సాగుచేసుకుంటున్న రైతుల్లో ఆందోళన



రెడ్డిగూడెంలో రైతులు సాగు చేసుకుంటున్న కాందిశీకుల భూమి

పాల్వంచరూరల్: కాందిశీకుల భూములను ఇటీవల కలెక్టర్ జితేష్ వి.పాటిల్ స్వయంగా వెళ్లి సర్వే చేయడంతో ఆ భూములను సాగు చేస్తున్న రైతులు కలవరం చెందుతున్నారు. మండల పరిధిలోని పాండురంగాపురం రెవెన్యూ రెడ్డిగూడెం గ్రామ సమీపంలో సర్వే నంబర్ 126/1లో 40 ఎకరాల కాందిశీకుల భూమి ఉంది. ఇందులో 2017లోనే 20మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను రెవెన్యూ అధికారులు ఇచ్చారు. అనేక సంవత్సరాలుగా దళిత రైతులు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ తరుణంలో సర్వే చేపట్టడంతో ఆవేదన చెందుతున్నారు.

**ఎనిమీ ప్రాపర్టీస్ లెక్కలో..**

ఎనిమీ ప్రాపర్టీస్ లెక్క తేల్చాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఈ నెల 21న సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో కస్టోడియన్ ప్రాపర్టీ ఆఫ్ ఇండియా(సెపీ) సంరక్షణలో ఉన్న శత్రు ఆస్తుల(ఎనిమీ ప్రాపర్టీస్)లకు సంబంధించి ఆస్తుల వివరాలను వచ్చే నెలాఖరులోగా ఇవ్వాలని సూచించారు. ఆ ఆస్తులు అన్యాక్రాంతానికి గురవుతున్నాయని, వాటి పరిరక్షణకు సంబంధిత అధికారులకు ఆదేశాలు రావడంతో కలెక్టర్ సర్వే చేపట్టారు.

**కలెక్టర్ పర్యవేక్షణలోనే..**

రెడ్డిగూడెంలోని సర్వేనంబర్ 126/1లో 40 ఎకరాల కాందిశీకుల భూమి ఉంది. ఈ భూమిని ఇటీవల కలెక్టర్ పరిశీలించారు. కాందిశీకుల భూములకు సంబంధించి సర్వే అంతా కలెక్టర్ పర్యవేక్షణలో జరుగుతుంది. –వివేక్, పాల్వంచ తహసీల్దార్

# పాఠశాలల్లో డీఈఓ పరిశీలన



చర్ల: కేజీబీవీలో కూరగాయలను పరిశీలిస్తున్న డీఈఓ వెంకటేశ్వరాచారి

చర్ల/దుమ్ముగూడెం: చర్ల మండలం లక్ష్మీకాలనీ, దుమ్ముగూడెం కేజీబీవీలను శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరాచారి సందర్శించారు. వంటశాలలను, వండిన ఆహార పదార్థాలను పరిశీలించారు. తొలుత పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు అందించే భోజనం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చర్ల మండలం క్రాంతిపురం వెళ్లి, పాఠశాల లేక విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై ఆరా తీశారు. సుబ్బంపేట ఎంపీపీఎస్ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలన్నారు. ఎంఈఓలు పీవీ రమణ, ఎస్. సమ్మయ్య, జీసీడీఓ అన్నామణి పాల్గొన్నారు.

**అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీ**

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం గంగమ్మకాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి స్వర్ణలత లెనినా ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సరుకుల నిల్వను తనిఖీ చేశారు. అనంతరం దాతలు వితరణ చేసిన టీషర్టులను స్థానిక ప్రజలకు పంపిణీ చేశారు. సీడీపీఓ లక్ష్మీప్రసన్న, సూపర్‌వైజర్ శారద, టీచర్ జ్యోతి పాల్గొన్నారు.

# ఆర్టీసీలో వనభోజనాలు..



మాట్లాడుతున్న ఆర్టీసీ ఆర్ఎం సరిరామ్



భోజనం చేస్తున్న ఉద్యోగులు

- కార్తీకమాసం సందర్భంగా రీజియన్‌లోని 7 డిపోల్లో కార్యక్రమాలు
- ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఉద్యోగుల సందడి

చుంచుపల్లి: ఆర్టీసీ సంస్థ ఆదాయం పెంపుతో ప్రయాణికులకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు ప్రాధాన్యమిస్తోంది. గతంలో ప్రయాణికులతో ఉద్యోగులు, సిబ్బంది మమేకమయ్యేలా అధికారులు వారంలో రెండుసార్లు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకున్నారు. ఇక విధి నిర్వహణలో నిత్యం పని ఒత్తిడికి లోనవుతున్న సిబ్బందికి ఉల్లాసం కలిగించేలా ఈ ఏడాది జనవరిలో తొలిసారి ఆర్టీసీ సంస్థ వనభోజనాల కార్యక్రమాలు నిర్వహించింది. సంస్థ లక్ష్యాలను సాధిస్తూ డిపోలు ఆర్థికంగా ముందుకు సాగేందుకు తోడ్పాటు అందిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది ఒకే చోట కలిసి మమేకమయ్యేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడింది. ఇక ప్రస్తుతం కార్తీకమాసం కావటంతో రీజియన్‌లోని అన్ని డిపోల పరిధిలో వనభోజనాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఒక్కో డిపోలో రెండు రోజులపాటు కార్యక్రమాలు నిర్వహిస్తుండగా డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, అధికారులు ఈ కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. అందరూ ఒకేచోట చేరి కుటుంబ సభ్యుల్లా కలిసి భోజనాలు చేయడంతో స్నేహపూర్వక వాతావరణం నెలకొంటోంది. రీజియన్‌లోని ఏడు డిపోల పరిధిలో 2,100 మంది వరకు ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఇప్పటివరకు కొత్తగూడెం, ఇల్లెందు, మధిర డిపోల్లో వన భోజనాలు నిర్వహించారు. మణుగూరు, భద్రాచలం, ఖమ్మం, సత్తుపల్లి డిపోల్లో నిర్వహించాల్సి ఉంది. వన భోజనాల సందర్భంగా సిబ్బందికి సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తున్నారు. ఉద్యోగుల సాధక బాధకాలను పంచుకోవడం, ఆటపాటలతో ఆర్టీసీ డిపోల్లో సందడి నెలకొంటోంది. అద్దె బస్సుల యజమానులు, సిబ్బంది సైతం ఇందులో భాగస్వామ్యం అవుతున్నారు.

**కార్మికుల కృషితోనే లాభాలు**

కార్మికులు, సిబ్బంది కృషితోనే ఆర్టీసీ డిపోలు లాభాల పట్టాయని ఖమ్మం రీజినల్ మేనేజర్ ఎ.సరిరామ్ తెలిపారు. శుక్రవారం కొత్తగూడెం డిపో ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్తీక మాస వన భోజనాల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్మికుల మానసిక ఉల్లాసానికి వనభోజనాల కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. అన్ని డిపోల పరిధిలో నాలుగు రోజులుగా వనభోజనాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆటల పోటీల విజేతలకు బహుమతులు అందించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు సైతం పలువురుని ఆకట్టుకున్నాయి. కొత్తగూడెం డిపో మేనేజర్ దేవేందర్ గౌడ్, ఎం.ఎఫ్ శ్రీనివాసరావు, జాకబ్, వైఎస్ రావు, శేషుబాబు, సునీత, రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆశ్రమాలకు సోలార్ వాటర్ హీటర్లు

**కలెక్టర్ జితేష్ వి.పాటిల్**



కమలాపురం ఆశ్రమ పాఠశాలలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

ములకలపల్లి: ఆశ్రమ పాఠశాలలకు సోలార్ వాటర్ హీటర్లు సమకూర్చుతామని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. మండల పరిధిలోని కమలాపురం ఆశ్రమ పాఠశాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కిచెన్, స్టోర్‌రూం, టాయిలెట్లను పరిశీలించారు. విద్యార్థుల స్నానానికి గ్యాస్, కట్టెల పొయ్యిల మీదు నీళ్ల వేడిచేసి ఇస్తున్నామని సిబ్బంది తెలపగా, సోలార్ వాటర్ హీటర్లు అందజేస్తామన్నారు. మెనూ పక్కాగా పాటించాలని, ఆవరణలో కూరగాయల మొక్కలు పెంచాలని ఆదేశించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని తద్వారా సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చన్నారు. తొలుత మండల కేంద్రంలోని మంగపేట పీహెచ్‌సీ ప్రహరీ నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలించారు. పీఆర్ ఈఈ శ్రీనివాసరావుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. గోడ నిర్మాణానికి వినియోగించే ఇటుకలను పని ప్రదేశంలో తయారు చేసేలా చూడాలని ఆదేశించారు. అనంతరం పైలెట్ ప్రాజెక్ట్‌లో భాగంగా ముత్యాలంపాడులో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల ఇంటింటి సర్వేను పరిశీలించారు. సర్వే బృందంతో మాట్లాడారు. ఎటువంటి ప్రలోభాలకు గురికావొద్దని, పారదర్శకంగా సర్వే చేయాలని ఆదేశించారు. అర్హులకు ప్రభుత్వ పథకాలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. డీఎంఅండ్‌హెచ్ఓ భాస్కర్‌నాయక్, తహసీల్దార్ గుడ్ల పుల్లారావు, ఎంపీడీఓ మహాలక్ష్మి, ఎంఈఓ జి. సత్యనారాయణ, ఎంపీఓ లక్ష్మయ్య, హెచ్ఎం బుచ్చిరాములు, పీఆర్ ఏఈ సురేశ్, పీఈటీ నాగప్రత్యూష, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, మాజీ ఎంపీపీ మట్ల నాగమణి, మాజీ ఉపసర్పంచ్ బాల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

**సెక్రటరీ.. చక్కటి పదవి..**

'సెక్రటరీ ఓ చక్కటి పదవి' అని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ కితాబిచ్చారు. మండలంలోని ముత్యాలంపాడు గ్రామపంచాయతీ కేంద్రంలో చేపడుతున్న ఇందిరమ్మ ఇంటింటి సర్వేను ఆయన పరిశీలించారు. డేటా ఎంట్రీతోపాటు, సమగ్ర సర్వే వివరాలు తెలిపిన ఇన్‌చార్జ్ సెక్రటరీ ఇబ్రహీం, సర్వే టీం సెక్రటరీ అశ్వాపురం మండలంలోని మొండికుంట జీపీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్‌లను కలెక్టర్ అభినందించారు. కేబినెట్ సెక్రటరీ, చీఫ్ సెక్రటరీ, లాగానే జీపీ సెక్రటరీ.. ఈ మూడు ఉద్యోగాలు అత్యంత కీలకమైనవని సరదాగా వ్యాఖ్యానించారు.

**పేదలకే డబుల్ బెడ్ రూం ఇళ్లు అందాలి**

సూపర్‌బజార్(కొత్తగూడెం): పేదలలో అత్యంత నిరుపేదలకు మాత్రమే డబుల్‌బెడ్ రూం ఇళ్లు మంజూరు చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శుక్రవారం డబుల్‌బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, సమగ్ర కుటుంబసర్వే డేటా ఎంట్రీ, భూ సమస్యలపై ఆర్‌డీఓలు, జిల్లా అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డేటా ఎంట్రీ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. కొత్తగూడెం, లక్ష్మీదేవిపల్లి, పాల్వంచ, అశ్వారావుపేట, చర్ల మండలాల్లో డేటా ఎంట్రీ ప్రక్రియపై అసహనం వ్యక్తం చేశారు. కరకగూడెం, చర్ల మండలాల్లో విద్యుత్ అంతరాయం, నెట్‌వర్క్ సమస్య, డేటా ఎంట్రీ ఆపరేటర్ల కొరత ఉన్నందున బూర్గంపాడు మండలం డేటా ఎంట్రీ ప్రక్రియ పూర్తయ్యాక, కరకగూడెం, చర్ల మండలం డేటా ఎంట్రీ ప్రక్రియను చేపట్టాలని ఆదేశించారు. తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో పర్యటించి డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. పిల్లలలో జీవనం సాగిస్తున్న ఒంటరి మహిళలు, వితంతువులు, గుడిసెల్లో జీవనం సాగిస్తున్న వారిని గుర్తించాలన్నారు. జిల్లాలో గిరిజనేతరులకు విభజన పేరుతో పట్టామార్పు లేదా భూమి అమ్మకానికి అధికారులు సహాయం చేస్తే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు.

# కమ్యూనిస్టులతోనే సమస్యల పరిష్కారం

**సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం**



మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

సుజాతనగర్: కమ్యూనిస్టులతోనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఆ పార్టీ సుజాతనగర్ మండల మహాసభను వేపలగడ్డలో సీతారాం ఏచూరి నగర్, గుగులోత్ ధర్మా ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయమని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక నిరంకుశ విధానాలతో పాలన సాగిస్తున్నాయని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు పన్ను మినహాయింపులిస్తూ, పేదల నుంచి పెద్ద మొత్తంలో పన్నులు వసూలు చేస్తోందని ఆరోపించారు. నరేంద్ర మోదీ ప్రభుత్వంలో నిత్యావసర వస్తువుల ధరలు, ఇంధన ధరలు, నిరుద్యోగం, పేదరికం, అవినీతి, అసమానతలు తీవ్రంగా పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం దేశంలో ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా భర్తీ చేయడంలేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ సీనియర్ నాయకుడు కాసాని ఐలయ్య, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, నాయకులు మచ్చా వెంకటేశ్వర్లు, లిక్కి బాలరాజు, కున్సోత్ ధర్మా, అన్నవరపు సత్యనారాయణ, వీర్ల రమేష్, ముదిగొండ రాంబాబు, నాగేశ్వరరావు, యాసా నరేష్, వెంకటరత్నం, కాట్రాల తిరుపతిరావు, నర్రా శివరామకృష్ణ, బచ్చలికూర శ్రీను, చప్పిడి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### కొండరెడ్లు ఆర్థికంగా ఎదగాలి



మాట్లాడుతున్న ఉదయ్ కుమార్

అశ్వారావుపేటరూరల్: కొండరెడ్ల అభివృద్ధి, ఆర్థిక బలోపేతానికి ఐటీడీఏ కృషి చేస్తోందని భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్ట్ ఉద్యానాధికారి వలపర్ల ఉదయ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని గోగులపూడి గ్రామంలో కొండరెడ్లతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. ఐటీడీఏ పథకాలను సద్వినియోగం చేసుకుని సంప్రదాయేతర వృత్తులు చేపట్టాలని సూచించారు. అధికారులు ఉదయ్ భాస్కర్, హరికృష్ణ, ప్రవీణ్‌కుమార్, ఆవుల వెంకటేశ్వరరెడ్డి, సోయం ప్రసాద్, రామకృష్ణ పాల్గొన్నారు.

# రాబోయే కాలంలో కేసీఆరే సీఎం

**దీక్షా దివస్‌లో రాజ్యసభ సభ్యుడు రవిచంద్ర**



మాట్లాడుతున్న వద్దిరాజు, హాజరైన పార్టీ శ్రేణులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాబోయే కాలంలో కాబోయే సీఎం కేసీఆరేనని, ప్రజలు కేసీఆర్ ప్రభుత్వాన్నే కోరుకుంటున్నారని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. శుక్రవారం దీక్షా దివస్ సందర్భంగా రైల్వేస్టేషన్ నుంచి జిల్లా పార్టీ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రగతిమైదాన్‌లో తెలంగాణ అమరువీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. అనంతరం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వద్దిరాజు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 11 నెలల పాలనలో ప్రజావ్యతిరేకతను మూటగట్టుకుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా రెపరెపలాడుతుందన్నారు. బీఆర్ఎస్ వ్యతిరేకించడం వల్లే కాంగ్రెస్ ప్రభుత్వం తన ప్రజావ్యతిరేక నిర్ణయాలను వెనక్కి తీసుకుంటోందన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, మాజీ ఎంఎల్ఏలు హరిప్రియ, మెచ్చా నాగేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకుడు వనమా రాఘవేందర్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగాల రాజేందర్, కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ, జిల్లాలోని ఐదు నియోజకవర్గాల నుంచి హాజరైన నాయకులలో కొందరు మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ పాత్రను, తాము నిర్వహించిన ఉద్యమాన్ని నెమరువేసుకున్నారు. తెలంగాణ ఉద్యమకారులను సన్మానించారు. కళాకారులు తెలంగాణ ఉద్యమం గురించి ఆలపించిన గేయాలు అలరించాయి. ఉద్యమ చరిత్రను, కేసీఆర్ చేసిన పోరాటాన్ని వివరిస్తూ డాక్యుమెంటరీని ప్రదర్శించారు.

## క్లుప్తంగా

### బంగారు ఆభరణం అందజేత



మహిళకు గొలుసు అందజేస్తున్న సిబ్బంది

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి దర్శనానికి వచ్చిన భక్తురాలు ప్రసన్న గురువారం రాత్రి రూ.లక్ష విలువైన బంగారు నల్లపూసల గొలుసును పోగొట్టుకుంది. ఆలయంలో విధులు నిర్వహిస్తున్న ఎస్‌పీఎఫ్ సిబ్బందికి గొలుసు దొరకడంతో ఈ విషయాన్ని ఆలయ ఈఓ రమాదేవి దృష్టికి తీసుకెళ్లారు. గొలుసు పోగొట్టుకున్న వైజాగ్‌కు చెందిన ప్రసన్న పూర్తి ఆధారాలు చూపించడంతో ఆలయ అధికారుల సమక్షంలో ఎస్‌పీఎఫ్ సిబ్బంది శుక్రవారం ఆమెకు అందజేశారు. ఎస్‌పీఎఫ్ సిబ్బందిని దేవస్థానం ఈఓ రమాదేవి అభినందించారు.

### శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం



దాతలకు రశీదు అందజేస్తున్న సిబ్బంది

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి శుక్రవారం ఏపీలోని ఎటపాక మండలం మేడువాయి గ్రామానికి చెందిన వి.సూర్యనారాయణమూర్తిరాజు రూ.లక్ష విరాళంగా అందించారు. దాతలు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకోగా.. అధికారులు స్వామి వారి ప్రసాదం, జ్ఞాపిక అందజేశారు.

### ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ కేసు కొట్టివేత

మణుగూరుటౌన్: మణుగూరు పట్టణానికి చెందిన విలేకరులపై 2019లో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసును కొట్టివేస్తూ ఖమ్మం ఎస్సీ, ఎస్టీ స్పెషల్ కోర్టు, డిస్ట్రిక్ట్ సెషన్ న్యాయమూర్తి దేవినేని రాంప్రసాద్‌రావు శుక్రవారం తీర్పునిచ్చారు. వివరాలిలా ఉన్నాయి. గతంలో అశ్వాపురం స్టేషన్ కానిస్టేబుల్‌గా పనిచేసిన గుగులోత్ మంగీలాల్ ఫిర్యాదు మేరకు 2019లో విలేకరులు మాచర్ల శ్రీనివాస్, లింగ శ్రీనివాస్, మారాసు సుధీర్‌పై మణుగూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. విచారణ అనంతరం కేసులో సరైన సాక్ష్యాధారాలు నిరూపణ కానందున జర్నలిస్టులపై నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును కొట్టివేస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. న్యాయవాదులుగా తేలూరి వెంకటేశ్వరరావు, మిర్యాల సైదేశ్వరరావు పాత్రికేయుల తరఫున వాదించారు.

### మధ్యాహ్న భోజన బియ్యం పరిశీలన



పౌరసరఫరాల శాఖ అధికారితో సిబ్బంది

దుమ్ముగూడెం: మండలంలోని నరసాపురం గ్రామంలోని సూదిరెడ్డి నాగిరెడ్డి ఆదిలక్ష్మమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన బియ్యాన్ని జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి రుక్మిణి శుక్రవారం పరిశీలించారు. పాఠశాలకు వచ్చిన, వినియోగించిన, మిగిలిన బియ్యాన్ని, భోజనశాలను, మంచినీటి సరఫరాను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆమె వెంట సివిల్ సప్లై ఇన్‌స్పెక్టర్ జి.రాజులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బెక్కంటి శ్రీనివాసరావు, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ రత్నకుమారి, స్టాఫ్ సెక్రటరీ చిలకమర్తి శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్ కేజీయ, ఉపాధ్యాయుడు విజయబాబు తదితరులు పాల్గొన్నారు.

### 2నుంచి 'ఇగ్నో' పరీక్షలు

ఖమ్మం సహకారనగర్: ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ(ఇగ్నో) పరీక్షలు వచ్చే నెల 2వ తేదీ నుంచి జరగనున్నాయని కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల సెంటర్ కోఆర్డినేటర్ కే.వీ.రమణారావు తెలిపారు. వివిధ కోర్సుల అభ్యర్థులకు డిసెంబర్ 2నుంచి జనవరి 9వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. నిర్ణీత తేదీల్లో ఉదయం, మధ్యాహ్నం జరిగే పరీక్షలకు అభ్యర్థులు హాజరు కావాలని సూచించారు.

### నేటి నుంచి జిల్లాస్థాయి టీ.టీ. టోర్నీ

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో శనివారం నుంచి రెండో రోజుల పాటు ఉమ్మడి జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు నిర్వహించనున్నారు. అండర్-11 నుంచి సీనియర్ పురుషులు, మహిళల విభాగాల్లో ఈ పోటీలు ఉంటాయని టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా బాధ్యులు బాలసాని విజయ్‌కుమార్, వీ.వీ.సాంబమూర్తి తెలిపారు. అలాగే, బాలబాలికలకు సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామని వెల్లడించారు.

### పామాయిల్ గెలలు



| | |
|---|---|
| టన్ను ధర | రూ.19,144 |

# ముగిసిన అజ్ఞాత దళాల ప్రస్థానం

- ఎన్‌డీ జిల్లా కార్యదర్శి రమేశన్న అరెస్టును ప్రకటించిన పోలీసులు
- 1967లో పగిడేరులో ప్రారంభమైన 'ఆత్మరక్షణ దళాలు'



ఎన్‌డీ జిల్లా కార్యదర్శి రమేశ్ అరెస్టును ప్రకటిస్తున్న డీఎస్పీ చంద్రభాను

ఇల్లెందు: సీపీఎం నుంచి విడిపోయిన ఎంఎల్ గ్రూపు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం పగిడేరులో 1967లో ఆత్మరక్షణ దళాలుగా అవతరించింది. అప్పటి నుంచి అజ్ఞాత దళాల ప్రస్థానం మొదలుకాగా ఇల్లెందు మండలం మర్రిగూడెం పంచాయతీ ఎల్లాపురంలో ప్రస్తుతం ముగిసింది. అజ్ఞాతంలో ఉన్న ఏకైక నేత, సీపీఐ (ఎంఎల్) ఎన్‌డీ (వైకే) భద్రాద్రి జిల్లా కార్యదర్శి పూనెం బాబు అలియాస్ రమేశ్ అనారోగ్యంతో బాధపడుతూ ఎల్లాపురంలోని స్వగృహానికి వచ్చినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న పోలీసులు గురువారం సాయంత్రం అదుపులోకి తీసుకోగా అరెస్ట్‌పై ఎలాంటి ప్రకటన వెలువడక పోవడంతో పార్టీ శ్రేణులు, కుటుంబీకులు ఆందోళనకు గురయ్యారు. ఈ నేపథ్యాన రమేశన్నను కాచనపల్లి పోలీసులు అరెస్టు చేసినట్లు ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను శుక్రవారం ఇల్లెందులో ప్రకటించారు. ఈ సమావేశంలో గుండాల సీఐ రవీందర్, కాచనపల్లి ఎస్‌ఐ సోమేశ్వర్ పాల్గొన్నారు. కాగా, ఆయన 2013 నుంచి అజ్ఞాతంలో ఉండగా, వ్యాపారులు, అటవీ ఉద్యోగులను బెదిరించిన ఘటనల్లో ఆయనపై ఆరు కేసులు నమోదయ్యాయని డీఎస్పీ వెల్లడించారు.

**వర్గాలుగా ఎన్‌డీ**

1967లో పగిడేరులో పుట్టిన ఎంఎల్ వర్గం క్రమంగా చీలిపోయింది. అంతిమంగా ఇల్లెందు మండలంలో మర్రిగూడెం పంచాయతీ ఎల్లాపురంలో ఎన్‌డీ (వైకే) వర్గం ప్రస్థానం ముగిసింది. ఆనాడు చంద్ర పుల్లారెడ్డి నాయకత్వంలో ఆయుధాలు పట్టగా.. ఆ తర్వాత ఎంఎల్‌లో అనేక గ్రూపులు అవతరించినా ఏకైక అజ్ఞాత నేతగా ఉన్న రమేశ్ అరెస్ట్‌తో దళాల చరిత్ర ముగిసిపోయినట్లయింది. ఎంఎల్‌లో ప్రజాపంథా, న్యూడెమోక్రసీ వైకే వర్గం, చంద్రన్న వర్గం, ప్రతిఘటన, ప్రజాప్రతిఘటన, గోదావరి లోయ ప్రజాప్రతిఘటన, జనశక్తి, సీపీయూఎస్ఐ, సీపీబాట, ఆదివాసీ లిబరేషన్ ఫ్రంట్, విమోచన ఇలా ఎన్నో గ్రూపులు ఏర్పడ్డాయి. ప్రస్తుతం అజ్ఞాతంలోకి వెళ్లి దళాల నిర్మాణం చేపట్టే వారెవరూ లేరనే చెబుతున్నారు. అంతేకాక అజ్ఞాత దళాల సంచారానికి ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల అటవీ ప్రాంతం అనుకూలంగా లేకపోవడం, అన్నిచోట్ల సెల్‌ఫోన్ల సిగ్నల్స్ విస్తరించడంతో క్షణాల్లో దళాల కదలికలు బయటపడుతున్నాయి. ఈ నేపథ్యాన అజ్ఞాత దళాల మనుగడ కష్టమని భావిస్తున్నారు.

# జీవనోపాధికి ప్రణాళికలు



సమావేశంలో మాట్లాడుతున్న కొండరెడ్ల తెగ గ్రామస్తుడు

దమ్మపేట: కొండరెడ్ల జీవనోపాధి, వారికి మెరుగైన స్థితిగతులను పెంపొందించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించనున్నామని భద్రాచలం ఐటీడీఏ అధికారులు వెల్లడించారు. శుక్రవారం మండలంలోని పూసుకుంట గ్రామంలో నివసిస్తున్న ఆదివాసీ తెగకు చెందిన కొండరెడ్లకు కావాల్సిన మౌలిక వసతులు, సౌకర్యాలు, మెరుగైన వ్యవసాయం, జీవనోపాధి తదితర అంశాలపై స్థానిక కమ్యూనిటీ భవనంలో ఐటీడీఏ అధికారులు సమావేశం నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో అధిక దిగుబడి సాధించే ఉద్యాన పంటల సాగులో మెళకువలు, యువతకు ఉపాధి శిక్షణ, వెదురుతో కళాకృతుల తయారీలో శిక్షణ తదితర అంశాలపై సమగ్రంగా వివరించారు. సమావేశంలో కొండరెడ్లు మాట్లాడుతూ.. గతంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లు శిథిలావస్థకు చేరుకున్నాయని, వాటి స్థానంలో డబుల్ బెడ్రూమ్ ఇళ్లను నిర్మించి, సీసీ రోడ్లను నిర్మించాలని కోరారు. వ్యవసాయం చేసేందుకు సరైన నీటి వసతులు లేనందున బోర్లు వేయించి, సాగుకు అవసరమైన అధునాతన యంత్రాలు, ట్రాక్టర్లను ఇప్పించాలని విన్నవించారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఉద్యాన శాఖ అధికారి ఉదయ్‌కుమార్, తహసీల్దార్ నరేశ్, ఎంపీడీఓ రవీందర్ రెడ్డి, ఎస్‌ఓ భాస్కరరావు, జేడీఎం హరికృష్ణ, టీఎస్‌ఏ రాంకుమార్, ఏఈ సుబ్బరాజు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## 'విప్లవ సమరోత్సాహంతో పీఎల్‌జీఏ వార్షికోత్సవాలు'



మావోయిస్టులు ఏర్పాటు చేసిన బ్యానర్

చర్ల: వచ్చేనెల 2 నుంచి 8వ తేదీ వరకు పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ) 24వ వార్షికోత్సవాలను విప్లవ సమరోత్సాహంతో జరపాలని మావోయిస్టు పార్టీ నేత ఆజాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన పత్రికలకు లేఖ విడుదల చేశారు. నూతన ప్రజాస్వామిక విప్లవ విజయ సాధన కోసం మావోయిస్టు పార్టీ నాయకత్వంలో పీఎల్‌జీఏ ఏర్పడి 24 ఏళ్లు నిండనున్నాయని తెలిపారు. ఈ నేపథ్యాన పట్టణ, మైదాన ప్రాంతాల్లో వార్షికోత్సవం నిర్వహించాలని కోరారు. ఈ క్రమంలో ఏడాది కాలంలో ప్రాణాలు కోల్పోయిన 200 మందికి విప్లవ జోహార్లు అర్పించాలని సూచించారు. అంతేకాక కేంద్రప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో చేస్తున్న యుద్ధానికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలను నిర్మించి గెరిల్లా పోరాటాన్ని తీవ్రతరం చేయాలని ఆజాద్ పిలుపునిచ్చారు.

**వద్దిపేట సమీపాన బ్యానర్**

వచ్చేనెల 2 నుంచి మావోయిస్టు పార్టీ పీఎల్‌జీఏ వార్షికోత్సవాలను నిర్వహించాలని కోరుతూ మావోయిస్టులు వద్దిపేట – పూసుగుప్ప గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై శుక్రవారం బ్యానర్ కట్టారు. మావోయిస్టు పార్టీ చర్ల – శబరి ఏరియా కమిటీ పేరిట ఈ బ్యానర్‌ను ఏర్పాటు చేశారు. చర్ల నుంచి పూసుగుప్పకు వెళ్లే మార్గంలో వద్దిపేట, పూసుగుప్పలో సీఆర్‌పీఎఫ్ క్యాంపులు ఉండగా రెండు క్యాంపుల మధ్య రహదారిపై మావోయిస్టుల బ్యానర్ ఏర్పాటు చేయడం చర్చనీయాంశంగా మారింది.

# మహిళా ఉద్యోగులకు సముచితస్థానం



మాట్లాడుతున్న కవితానాయుడు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో డిపెండెంట్ ద్వారా ఉద్యోగంలో చేరిన మహిళలకు (బదిలీ వర్కర్లకు) సముచితస్థానం కల్పించేందుకే కౌన్సెలింగ్ ఉపయోగపడుతుందని జీఎం పర్సనల్ (ఐఆర్‌పీఎం) కవితానాయుడు పేర్కొన్నారు. శుక్రవారం కొత్తగూడెం కార్పొరేట్ హెచ్‌ఆర్‌డీ కాన్ఫరెన్స్ హాల్లో వివిధ విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న మహిళా ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కవితానాయుడు మాట్లాడుతూ.. సింగరేణి యాజమాన్యం కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంస్థలో కష్టపడి పని చేసి, ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కాగా, కౌన్సెలింగ్‌లో 76 మంది బదిలీ ఉద్యోగులు (మహిళలు) పాల్గొన్నారు. కార్యక్రమంలో జీఎం (ఐఈడీ) సురేశ్‌బాబు, ఏసీఎంఓ ఎం.ఉషా, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ జాకీర్ హుస్సేన్, డీజీఎం పర్సనల్ రాజగోపాల్, పర్సనల్ మేనేజర్ సీవీఎస్ మూర్తి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

### నాటుసారా పట్టివేత

మణుగూరుటౌన్: నాటుసారా.. తరిస్తున్న వ్యక్తిని పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఎక్సైజ్ అధికారుల కథనం ప్రకారం.. అశ్వాపురం మండలం కల్యాణపురంనకు చెందిన భుక్యా నాగేశ్వరరావు స్కూటీపై మణుగూరు శివారులోని రైల్వేస్టేషన్‌కు దూరంగా ఉండే ఓ గుంపు నుంచి నాలుగు లీటర్ల నాటుసారాను కొనుగోలు చేసి కల్యాణపురం వెళ్తున్నాడు. అతడిని పట్టుకుని కేసు నమోదు చేశామని పోలీసులు చెప్పారు. దాడిలో సీఐ రాజిరెడ్డి, ఎస్‌ఐ కిశోర్‌బాబు తదితరులు ఉన్నారు.

### గంజాయి స్వాధీనం



గంజాయి, నిందితుడిని చూపుతున్న అధికారులు

భద్రాచలంటౌన్: ఒడిశా నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న ఎండు గంజాయిని ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. భద్రాచలం నుంచి మణుగూరు వరకు రూట్ వాచ్‌లో భాగంగా వాహన తనిఖీలు చేస్తున్న క్రమంలో ద్విచక్రవాహనంపై ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని ఆపి తనిఖీ చేయగా 25.16 కిలోల ఎండు గంజాయి లభించింది. మిర్యాలగూడకు చెందిన తెరపతి కల్యాణ్, ఖమ్మానికి చెందిన చట్టంతో పాటు ద్విచక్రవాహనం, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని మణుగూరు పోలీసులకు అప్పగించినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పేర్కొన్నారు. తనిఖీల్లో సిబ్బంది రమేశ్, కరీం, సుధీర్, వెంకట్, విజయ్, హరీశ్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ద్విచక్రవాహనదారుడి హల్‌చల్

జూలూరుపాడు: మండల కేంద్రంలోని ఓ పెట్రోల్ బంకు వద్ద శుక్రవారం రాత్రి ద్విచక్రవాహనదారుడు మద్యం మత్తులో హల్‌చల్ చేశాడు. పెట్రోల్ తక్కువ వస్తుందంటూ అన్నారుపాడు గ్రామానికి చెందిన ద్విచక్రవాహనదారుడు అతని స్నేహితుడు కలిసి ఆందోళనకు దిగారు. ఈ సమయంలో ద్విచక్రవాహనదారుడు, పెట్రోల్ బంకు నిర్వాహకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పెట్రోల్ బంకు నిర్వాహకులు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనాస్థలానికి చేరుకున్నారు. మద్యం మత్తులో ఉన్న ద్విచక్రవాహనదారుడు, అతని స్నేహితున్ని పోలీసులు వారించే ప్రయత్నం చేసినప్పటికీ వినకపోవడంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పెట్రోల్ తక్కువ వస్తుందని ద్విచక్రవాహనదారుడు చెబుతున్నాడు. బాటిల్ పెట్రోల్ పోయాలని అడిగితే సీరియల్‌లో ఉన్న వాహనాలకు కొట్టిన తరువాత కొడతామని చెప్పగా గొడవకు దిగారని పెట్రోల్ బంకు నిర్వాహకులు చెబుతున్నారు. దాడి చేసేందుకు యత్నించారని ద్విచక్రవాహనదారుడిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో పెట్రోల్ బంకు నిర్వాహకులు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

# భర్తపై కత్తితో దాడి చేసిన భార్య

కుటుంబ కలహాల నేపథ్యాన ఘటన



రవిని ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

వైరారూరల్: వైరా మండలంలోని గొల్లపూడిలో కుటుంబ కలహాల కారణంగా ఓ వ్యక్తిపై ఆయన భార్య కత్తితో దాడి చేసింది. మద్యం తాగి విధులకు వెళ్లి ఉద్యోగం కోల్పోయినా ఆయన తీరు మారకపోగా గొడవ పడుతుండడంతో క్షణికావేశంలో ఆమె ఈ ఘటనకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఎస్సై ఏ.వంశీకృష్ణ తెలిపిన వివరాలు... గొల్లపూడికి చెందిన పారాశ్ల రవికి రెబ్బవరానికి చెందిన లక్ష్మితో తొమ్మిదేళ్ల క్రితం వివాహం జరగగా వీరికి ఎనిమిదేళ్ల కుమార్తె ఉంది. రవి విద్యాశాఖలో సీఆర్పీగా పనిచేస్తూ ఆరు నెలల క్రితం మద్యం సేవించి విధులకు వెళ్లడంతో అధికారులు తొలగించారు. అప్పటి నుండి రవి ఖాళీగా ఉంటున్నాడు. ఆయన భార్య లక్ష్మి వైరాలోని ఒక ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తూ కుటుంబ పోషణ చూస్తోంది. అయితే, ఖాతాలో ఉన్న డబ్బును(ఫోన్‌పే ద్వారా) మద్యానికి ఖర్చు చేస్తున్నాడని రవి సెల్‌ఫోన్‌ను శుక్రవారం ఉదయం ఆయన భార్య తీసుకుంది. దీంతో రవి ఆమెపై దాడి చేయడంతో కోపోద్రిక్తురాలైన లక్ష్మి క్షణికావేశంలో కత్తితో దాడి చేసింది. ఈ ఘటనలో ఆయనకు పలుచోట్ల గాయాలై రక్తస్రావం జరగడంతో ఎస్సై సిబ్బందితో చేరుకుని ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆపై లక్ష్మిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

# వేధింపులతోనే లెక్చరర్ ఆత్మహత్య

కుటుంబ సభ్యుల ఆరోపణ



శ్రీనివాస్ (ఫైల్)

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలో పులిపాటి ప్రసాద్ నర్సింగ్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్న లక్కినేని శ్రీనివాస్‌ను కళాశాల సిబ్బంది వేధించడంతోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడని భార్య అనురాధ, సోదరుడు లక్కినేని నవీన్ ఆరోపించారు. కొత్తగూడెం పట్టణం రామవరంలోని సుభాష్ చంద్రబోస్‌నగర్‌కు చెందిన లక్కినేని శ్రీనివాస్, లక్ష్మీదేవిపల్లి మండలంలోని పులిపాటి ప్రసాద్ నర్సింగ్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. కళాశాలలో పనిచేసే మాధవి, పుల్లారావు, ప్రశాంత్ ఏడాదిగా వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. పలుమార్లు కుటుంబ సభ్యులకు శ్రీనివాస్ చెప్పాడని, పని దగ్గర సర్దుకుపోవాలని కుటుంబ సభ్యులు చెప్పడంతో లెక్చరర్‌గా కొనసాగాడని, అందరికీ వేతనాలు ఇచ్చి, శ్రీనివాస్‌కు ఇవ్వకుండా వేధింపులకు గురిచేశారని తెలిపారు. దీంతో మనస్తాపానికి గురైన శ్రీనివాస్ ఈ నెల 20న పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడని చెప్పారు. పులిపాటి ప్రసాద్ కళాశాలలో పనిచేసే మాధవి, ప్రశాంత్, పుల్లారావు వేధింపులతోనే శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకున్నాడని భార్య అనురాధ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సందర్భంగా సెల్ఫీ వీడియోలో శ్రీనివాస్ మాట్లాడిన తీరు.. సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.

# నగదు కాజేసేందుకు యత్నం



అరెస్టు వారెంట్‌ను వాట్సాప్ ద్వారా పంపించిన సైబర్ దుండగులు

అశ్వారావుపేటరూరల్: ఓ రైతు బ్యాంక్ ఖాతా నుంచి నగదు కాజేసేందుకు గుర్తు తెలియని దుండగులు యత్నించిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని నల్లబాడు గ్రామానికి చెందిన ఈపుగంటి వీరబాబు వాట్సాప్ నంబర్‌కు మూడు రోజుల కిందట గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఆధార్, పాన్ కార్డుల నంబర్లు సేకరించారు. శుక్రవారం గుర్తు తెలియని దుండగులు వీరబాబుకు ఫోన్ చేసి ఆధార్, పాన్ కార్డు ద్వారా దాదాపు రూ.25 లక్షల నగదు అక్రమంగా బదిలీ జరిగిందని, ఈ నగదు అంతా మనీలాండరింగ్ పరిధిలోకి రావడంతో ముంబైలో కేసు నమోదైనట్లు భయాందోళనకు గురిచేశారు. ఈ కేసు నుంచి బయటపడేందుకు రూ.6290 ఫోన్‌పే లేదా గూగుల్‌పే ద్వారా చెల్లించాలని డిమాండ్ చేయగా, తన వద్ద నగదు లేదని చెప్పి గడువు అడిగాడు. కొంత సమయం తర్వాత అదే నంబరుకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రాగా, ఈ విషయాన్ని తనకు తెలిసిన వారికి చెప్పడంతో సైబర్ కేటుగాళ్లు చేసినట్లు చెప్పడంతో బాధితుడు ఊపిరిపీల్చుకున్నాడు. బాధితుడు పోలీసులను ఆశ్రయించగా, సైబర్‌క్రైం విభాగానికి ఫిర్యాదు చేయించారు.

## ఆ సెల్ ఎవరిది?

- నేలకొండపల్లి హత్యల కేసులో కీలకంగా కాల్ రికార్డ్
- చెత్తకుప్పలో దొరికిన సెల్‌ఫోన్ ఆధారంగా విచారణ

నేలకొండపల్లి: నేలకొండపల్లిలో గత మంగళవారం రాత్రి దంపతులు ఎర్రా వెంకటరమణ – కృష్ణకుమారి హత్యకు గురైన ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపగా.. ప్రత్యేక పోలీసు బృందాల విచారణ కొనసాగుతోంది. అయితే, ఇప్పటివరకు మిస్టరీ వీడకపోగా శుక్రవారం కీలక ఆధారంగా భావిస్తున్న సెల్‌ఫోన్ పోలీసుల చేతికి చిక్కినట్లు సమాచారం. ఈ ఫోన్ కాల్ డేటాతో పాటు ఫోన్ లభించిన ప్రాంతానికి సమీపాన ఉన్న షాపు నుంచి సీసీ కెమెరాల పుటేజీ సేకరించడంతో దర్యాప్తులో అడుగు ముందుకు పడినట్లు భావిస్తున్నారు.

**చెత్త కుప్పలో ఫోన్**

నేలకొండపల్లిలో పెట్రోల్ బంక్ ఎదురుగా గ్రామ పంచాయతీ స్వీపర్ శుక్రవారం ఉదయం చెత్త తొలగిస్తుండగా ఓ చోట సెల్‌ఫోన్ లభించింది. దీంతో ఆమె స్థానిక పోలీసులకు అప్పగించింది. ఈ విషయం తెలియగానే ప్రత్యేక బృందాలు సైతం సదరు స్వీపర్ ఇంటికి సైతం వెళ్లి విచారించారు. అంతేకాక సెల్‌ఫోన్ దొరికిన ప్రాంతంలో ఓ దుకాణం నుంచి సీసీ కెమెరాల పుటేజీ కూడా స్వాధీనం చేసుకున్నారు. ఆ ఫోన్ నిందితులు పారిపోయే క్రమంలో కింద పడిందా, లేక మృతుల ఫోన్‌ను తీసుకెళ్లే క్రమాన వదిలేశారా అనే విషయాన్ని పోలీసులు గుర్తించినట్లు తెలుస్తుండగా స్పష్టత ఇవ్వడం లేదు. హంతకుల ఫోన్ అయితే హత్య జరిగిన రోజే లభించేదని, రెండు రోజుల తర్వాత దొరకడంతో నిందితులు మళ్లీ ఇక్కడకు వచ్చి, వెళ్లారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈనేపథ్యాన సెల్‌ఫోన్ కాల్‌డేటా, సీసీ కెమెరాల పుటేజీ ఆధారంగా దర్యాప్తులో వేగం పెంచినట్లు పోలీసువర్గాల ద్వారా తెలిసింది. ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి, కూసుమంచి సీఐ సంజీవ్‌తో పాటు వివిధ పోలీస్‌స్టేషన్ల ఎస్సైలు శుక్రవారం సైతం గ్రామంలోని పర్యటించి పలువురు అనుమానితులను విచారించినట్లు సమాచారం. ఈ విషయమై పోలీసుల వివరణ కోరగా సెల్‌ఫోన్ దొరికిన మాట వాస్తవమేనని చెప్పినా ఇతర వివరాలు మాత్రం వెల్లడించేందుకు నిరాకరించారు.

### మిరప తోటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

కొణిజర్ల: మండలంలోని బస్వాపురంలో రైతులు సాగు చేసిన మిర్చి తోటలను శుక్రవారం వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశీలించారు. వైరా కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్, ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ వి.చైతన్య మిర్చిని పరిశీలించి కొమ్మ కుళ్లు తెగులు ఉధృతి ఉందని గుర్తించారు. దీని నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ మందును కొమ్మలు తడిచేలా పిచికారీ చేయాలని సూచించారు. అలాగే, లద్దె పురుగు నివారణకు తవుడులో క్లోరిపైరిఫాస్, బెల్లం తగినంత మోతాదులో కలిపి గుళికలుగా చేసి చల్లాలని, పెద్ద పురుగు నివారణకు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. అంతేకాక పూత, పిందె దశలో మొక్కలకు సూక్ష్మ పోషకాలు అందజేయాలని సూచించారు. నల్ల తామర పురుగులు కనిపిస్తే నీలి రంగు జిగురు అట్టలను ఎకరానికి 15నుంచి 20 వరకు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ బాలాజీ, ఏఈఓ సరిత పాల్గొన్నారు.

### విద్యుత్ తీగ చోరీ

దుమ్ముగూడెం: మండలంలోని ములకపాడు గ్రామంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియం వద్ద విద్యుత్ సరఫరాకు ఏర్పాటు చేసిన వైరును గుర్తు తెలియని దుండగులు అపహరించారు. వైద్యశాల ప్రాంగణంలోని విద్యుత్ స్తంభం నుంచి ఇండోర్ స్టేడియానికి విద్యుత్ సరఫరా నిమిత్తం వైరును ఏర్పాటు చేశారు. కాగా గురువారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు సుమారు 200 మీటర్ల విద్యుత్ వైరును కత్తిరించి చోరీ చేశారు.

### వ్యక్తి అదృశ్యంపై కేసు



బాడిశె సోమయ్య

దుమ్ముగూడెం: మండలంలోని ముసలిమడుగు గ్రామానికి చెందిన బాడిశె సోమయ్య కనిపించడం లేదని సోదరి కుర్సం అదెమ్మ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని సీఐ అశోక్ శుక్రవారం తెలిపారు. సోమయ్య ఏడాదిగా మానసిక స్థితి సరిగా లేక ఇబ్బంది పడుతున్నాడు. ఇంటి నుంచి వెళ్లి తిరిగి రావడం సాధారణమైపోయింది. ఈ క్రమంలో ఈ నెల 23న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడం అదెమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆచూకీ తెలిసిన వారు సీఐ 87126 82115, దుమ్ముగూడెం పోలీస్‌స్టేషన్ – 87126 82116, ఎస్‌ఐ-1 87126 82117, ఎస్‌ఐ-2 87126 82118 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

### ఇరువర్గాలపై..

పాల్వంచరూరల్: పత్తి కూలీ డబ్బుల విషయంలో చోటు చేసుకున్న వివాదం ఘర్షణకు దారితీసింది. ఇరువర్గాలు ఘర్షణ పడటంతో పోలీసులు ముగ్గురిపై కేసు నమోదు చేశారు. మండలంలోని కోడిపుంజుల వాగు గ్రామానికి చెందిన అజ్మీర శ్రీనివాస్ పత్తి చేనులో కూలీలుగా జర్పుల ప్రవీణ్, భూక్యా రామ్మూర్తి పనిశారు. వారు కూలి డబ్బుల కోసం శుక్రవారం శ్రీనివాస్, అతని భార్య మహేశ్వరితో గొడవ పడి దాడి చేశారు. దీంతో శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేశారు. కూలీ డబ్బులు అడిగినందుకు శ్రీనివాస్ తనపై దాడి చేశారని జర్పుల ప్రవీణ్ ఫిర్యాదు చేయగా శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేశ్ తెలిపారు.

### శబరిమలలో ఖమ్మం జిల్లా వాసి మృతి



వెంకన్న (ఫైల్)

నేలకొండపల్లి: అయ్యప్పస్వామి దర్శనానికి శబరిమల వెళ్లిన ఓ భక్తుడు అక్కడ అనారోగ్యానికి గురై మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలం చెన్నారానికి చెందిన సీ.హెచ్.వెంకన్న(32) గ్రామంలోని మరికొందరితో కలిసి మంగళవారం ఇరుముడి కట్టుకుని శబరిమల వెళ్లాడు. అక్కడ గురువారం స్వామిని దర్శించుకుని కిందకు దిగారు. అయితే, వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్న వెంకన్న అస్వస్థతకు గురికాగా, రక్త విరోచనాలతో ఇబ్బంది పడ్డాడు. సహచర భక్తులకు చెప్పగా వారు వైద్యం చేయించినా ఫలితం లేక దేవస్థానం అధికారులు కొట్టాయంలోని ప్రధాన ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. దీంతో ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా శుక్రవారం మృతి చెందాడు. వెంకన్నకు భార్య, ఇరువురు కుమార్తెలు ఉండగా ఆయన మృతి సమాచారంతో అందడంతో విషాదఛాయలు అలుముకున్నాయి.

## క్లుప్తంగా...

### పీఎస్ అథెంటికేషన్ దుర్వినియోగం కావొద్దు

**డీఆర్డీవోలకు సెర్ప్ సీఈవో ఆదేశాలు**

సాక్షి, హైదరాబాద్: చేయూత పింఛన్ల పంపిణీలో భాగంగా పంచాయతీ కార్యదర్శులు 'పీఎస్ అథెంటికేషన్'ద్వారా మంచానికే పరిమితమైన వారు, బయోమెట్రిక్ ఫెయిలైన వ్యక్తులకు మాత్రమే పింఛన్లు పంపిణీ చేసేలా చూడాలని డీఆర్‌డీవోలను.. గ్రామీణ దారిద్ర్య నిర్మూలన సంస్థ (సెర్ప్) సీఈవో డి.దివ్య ఆదేశించారు. వీరికి కాకుండా ఇతరులకు ఈ పద్ధతి ద్వారా పింఛన్లు అందించినట్టు తేలితే కఠినచర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. పింఛన్ల అందజేత సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలు ఈ విషయంలో స్పష్టంగా ఉన్నాయన్నారు. శుక్రవారం ఈ మేరకు డీఆర్‌డీవోలకు దివ్య లేఖ రాశారు. ఈ విషయంలో కచ్చితమైన మార్గదర్శకాలున్నా.. కొందరు పంచాయతీ కార్యదర్శులు, బిల్ కలెక్టర్లు తమ పీఎస్ అథెంటికేషన్ ద్వారా ఇతరులకు కూడా పింఛన్ పంపిణీ చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఇలా చేయడం వల్ల ఆర్థికపరమైన అవకతవకలకు దారితీసే అవకాశముందన్నారు. పీఎస్ అథెంటికేషన్ చెల్లింపునకు సంబంధించి పంచాయతీ కార్యదర్శులు, బిల్ కలెక్టర్లు విడిగా ఓ అక్విటెన్స్ రిజిస్టర్‌ను మెయింటెయిన్ చేయాలని, అందులో పింఛనుదారుల సంతకాలు లేదా వేలిముద్రలు నమోదుచేయాలని ఆదేశించారు.

### ఐటీ ఉద్యోగాలపై ప్రత్యేక ప్రసారాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఐటీ శాఖ ఆధ్వర్యంలో వీఎల్ఎస్ఐ అవేర్‌నెస్ ప్రోగ్రాం పేరిట నాలుగు నెలల పాటు ప్రత్యేక కార్యక్రమాలను ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు టీ-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పీవీసీ (పాటానిక్స్ వ్యాలీ కార్పొరేషన్), టాస్క్ (తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్), ఏఎస్ఐపీ(అడ్వాన్స్‌డ్ సిస్టమ్ ఇన్ ప్యాకేజ్ టెక్నాలజీస్), టీ-సాట్ (తెలంగాణ స్కిల్ అకడమిక్ అండ్ ట్రైనింగ్) సంయుక్తంగా డిజైన్ చేసిన కోర్సులను ప్రత్యేక ప్రత్యక్ష ప్రసారాల ద్వారా అందించనున్నట్లు తెలిపారు. వీఎల్ఎస్ఐపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నవంబర్ 30 ఉదయం 10 గంటలకు తెలంగాణ ఐటీ కమ్యూనికేషన్ల శాఖ డిప్యూటీ సెక్రటరీ భవేశ్ మిశ్రా ప్రారంభిస్తారని తెలిపారు. ప్రసారాలు ఉదయం 10 గంటలకు టీ-సాట్ నిపుణ చానల్‌లో.. ఆదివారం సాయంత్రం విద్యా చానల్‌లో 7 గంటల నుంచి 8 గంటల వరకు ప్రసారమౌతాయని పేర్కొన్నారు. ఏప్రిల్ 12వ తేదీ వరకు ఇదేవిధంగా కొనసాగే షెడ్యూల్‌ను యువత గుర్తించాలని సీఈవో సూచించారు.

# రిషితేశ్వరి ఆత్మహత్య కేసు కొట్టివేత

- గుంటూరు ఐదో అదనపు జిల్లా కోర్టు తీర్పు... నిందితులపై నేరాన్ని నిరూపించలేకపోయిన ప్రాసిక్యూషన్
- తీర్పు వెలువడగానే కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు..
- న్యాయం జరగలేదని.. గంగలో దూకడమే శరణం అంటూ ఆవేదన
- అన్ని ఆధారాలు సమర్పించాం.. అయినా కేసు కొట్టేశారు
- తీర్పు న్యాయమైంది కాదని భావిస్తున్నాం.. హైకోర్టుకు వెళ్లే ఆలోచన చేస్తాం.. పోలీసులు అప్పీలు చేయాలి: స్పెషల్ పీపీ


రిషితేశ్వరి కేసు కొట్టివేయడంతో కోర్టు ఆవరణలో విలపిస్తున్న రిషితేశ్వరి తల్లి దుర్గాభాయ్, ఆమె పక్కన తండ్రి మురళీకృష్ణ

సాక్షి ప్రతినిధి, గుంటూరు/నగరంపాలెం: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ (ఏఎన్‌యూ) ఆర్కిటెక్చర్ విద్యార్థిని ఎం. రిషితేశ్వరి ఆత్మహత్య కేసును కొట్టివేస్తూ గుంటూరు కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది. వరంగల్‌కు చెందిన రిషితేశ్వరి గుంటూరు జిల్లా పెదకాకాని మండలం ఏఎన్‌యూలో బ్యాచ్‌లర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (బీఆర్క్) చదువుతూ, 2015 జూలై 14న బాలికల వసతిగృహంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ర్యాగింగ్, వేధింపులవల్లే తమ కుమార్తె ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతురాలి తల్లిదండ్రులు అప్పట్లో పెదకాకాని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అయితే, నిందితులపై మోపిన నేరాన్ని ప్రాసిక్యూషన్ నిరూపించలేకపోవడంతో కేసును కొట్టేస్తూ గుంటూరు ఐదో అదనపు జిల్లా జడ్జి కె. నీలిమా తీర్పు వెలువరించారు.

### కేసు పూర్వాపరాలు..

నిజానికి.. రిషితేశ్వరి ఆత్మహత్య ఘటన అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. బీసీ సామాజికవర్గానికి చెందిన విద్యార్థిని బలవన్మరణానికి కారణమైన యూనివర్సిటీ అధికారులు, సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోకుండా అప్పటి టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. విద్యార్థిని మృతికి కారణమైన అప్పటి ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.బాబురావుతో పాటు యూనివర్సిటీ ఉన్నతాధికారులపై కేసు నమోదు చేయాలని, ర్యాగింగ్‌కు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని, రిషితేశ్వరి కుటుంబానికి న్యాయం చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు పెద్దఎత్తున ఉద్యమం చేశాయి. చంద్రబాబు నిర్లక్ష్యం వీడాలని అప్పట్లో అసెంబ్లీలోనూ ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ ఉద్యమాన్ని అణచివేసేందుకు నాటి ప్రభుత్వం చేయని ప్రయత్నంలేదు. చివరికి.. ఈ పోరాటాల ఫలితంగా టీడీపీ ప్రభుత్వం విధిలేని పరిస్థితుల్లో ప్రిన్సిపాల్ జి. బాబురావుపై చర్యలు తీసుకుని, ఆరోపణలు ఎదుర్కొంటున్న విద్యార్థులను సస్పెండ్ చేశారు. ఈ నేపథ్యంలో.. సుదీర్ఘకాలం విచారణ జరిగిన అనంతరం శుక్రవారం గుంటూరు కోర్టు కేసును కొట్టివేసింది. దీంతో.. తీర్పు వెలువడగానే రిషితేశ్వరి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

### డైరీలను పట్టించుకోలేదు..

కోర్టు తీర్పుతో మా ఆశలు చచ్చిపోయాయి. మాకు పూడ్చలేని బాధను మిగిల్చారు. న్యాయం జరుగుతుందని తొమ్మిదేళ్లుగా కోర్టుల చుట్టూ తిరిగాం. సాక్ష్యాధారాలు లేకపోవడంతో కేసు కొట్టేశామని చెప్పడం ఎంతో బాధగా ఉంది. మా కుమార్తె డైరీని స్వయంగా రాసింది. ఫోరెనిక్స్ ల్యాబ్ కూడా రిషితేశ్వరినే రాసిందని తేల్చిచెప్పింది. అయినా మా కుమార్తెకు అన్యాయం జరిగింది. ఇందులో 170 మంది సాక్షులున్నారు. కానీ, ఏ ఒక్కరూ వారికి కనిపించలేదు. మాకింక దిక్కెవరు? గంగలో దూకడమే శరణ్యం. పాప రాసిన డైరీలను ఎందుకు సాక్ష్యంగా తీసుకోలేదో అర్థంకావడంలేదు. గతంలో సీఎం చంద్రబాబు, గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, జిల్లా ఎస్పీకి డైరీ కాపీలు అందజేసినా పరిగణలోకి తీసుకోలేదు. హైకోర్టుకు వెళ్లే విషయాన్ని ఆలోచిస్తాం.

– రిషితేశ్వరి తల్లిదండ్రులు దుర్గాభాయ్, మురళీకృష్ణ, రాజమండ్రి

### గుండె ఘోషకు రిషితేశ్వరి అక్షర రూపం ఇదే..

రిషితేశ్వరి ఆత్మహత్య తరువాత ఆమె గదిలో డైరీ లభించింది. అందులో రిషితేశ్వరి స్వహస్తాలతో రాసుకున్న కొన్ని ఘటనలు, తాను ఎదుర్కొన్న ఆవేదన, గుండెఘోషను కూలంకుషంగా అక్షర రూపంలో వివరించింది. 'మై లాస్ట్ నోట్'పేరుతో తన స్వహస్తాలతో రిషితేశ్వరి రాసిన కొన్ని ముఖ్యాంశాలు ఏమిటంటే..

- నవ్వు!!! నవ్వు!!! నవ్వు!!! ఈ నవ్వు అంటే నాకు చాలా ఇష్టం. అందుకే నేను ఎప్పుడూ నవ్వుతూ ఉంటా. అందరిని నవ్విస్తూ ఉంటా. కానీ, ఆ నవ్వే నాకు పెద్ద సమస్య అయింది.
- మా నాన్న అంటే నాకు చాలా ఇష్టం. నిజానికి పిచ్చి. అంత ప్రేమగా పెంచాడు మా నాన్న. నాకు చదువు అంటే ఇష్టం. ఈ చదువు కోసం నా ఊరు వదిలి ఇక్కడకొచ్చా.
- ఇలా వచ్చిన నన్ను.. నా సీనియర్స్‌లో కొంత మంది చదువు వైపు కాకుండా ప్రేమవైపు లాగడానికి ప్రయత్నించారు. నేను ఆ దారిలోకి వెళ్లలేదు. దాంతో నా మీద రూమర్స్ క్రియేట్ చేశారు. అది వింటేనే నా మొహంలో నవ్వు మాయమై పోయేది.. ఏడుపు కూడా వచ్చేది.
- నేను నాన్న దగ్గర ఏమీ దాచేదాన్ని కాదు.. కాని ఇక్కడకు వచ్చాక చెబితే ఏమైపోతారో అని దాయాల్సి వస్తోంది. నాకు నరకయాతన కనిపిస్తోంది.
- నా ఆఖరి కోరిక ఒక్కటే. నా చావుకు కారణం ఎవరో వాళ్లకు తెలుసు. వాళ్ల వాళ్ల తప్పు తెలుసుకుంటే చాలు. ఇంకెవ్వరినీ ఇలా (నాలా) బాధపెట్టకుంటే చాలు.
- ఏ అమ్మాయిలూ యూనివర్సిటీలో ర్యాగింగ్ ఉండదని అనుకోవద్దు. ఏ తల్లిదండ్రులు పిల్లల్ని ఇంత ప్రేమగా పెంచవద్దు. మీకు చెప్పలేక వాళ్లలో వాళ్లు దాచుకోలేక నరకం కనిపిస్తుంది.
- అమ్మా, నాన్న జాగ్రత్త! నాన్న ప్లీజ్ ఏడవకండి. నేను ఎప్పుడూ మీ దగ్గర్లోనే ఉంటా. ట్రై టూ డొనేట్ మై ఆర్గాన్స్ ఇఫ్ దే ఆర్ ఇన్ గుడ్ కండీషన్.. (నా అవయవాలు పనిచేసే స్థితిలో ఉంటే వాటిని దానం చేయడానికి ప్రయత్నించండి) అంటూ చాలా అంశాలు రాసింది.

### కోర్టులో అన్నీ సమర్పించాం, అప్పీలుకు వెళ్లాలి..

రిషితేశ్వరి డైరీల్లో ఎవరెవరు ర్యాంగింగ్‌కు పాల్పడ్డారు, మానసికంగా వేధించిన వారి పేర్లు స్పష్టంగా ఉన్నాయి. అవన్నీ కోర్టు ముందున్నాయి. తోటి విద్యార్థులు, సీనియర్లు ఎలా వేధించారో కూడా అందులో స్పష్టంగా ఉంది. ప్రిన్సిపాల్ బాబురావుకు రిషితేశ్వరి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. అప్పట్లో హాయ్‌ల్యాండ్‌లో జరిగిన స్పెషల్ పార్టీలో లైంగికంగా వేధించారు. వీటన్నింటిని పరిగణలోకి తీసుకుంటే నిందితులకు శిక్షపడుతుందని భావించాం. కానీ, కోర్టు కేసును కొట్టేసింది. ఈ తీర్పు న్యాయమైంది కాదని భావిస్తున్నాం. హైకోర్టుకు వెళ్లే ఆలోచన చేస్తాం. పోలీసులు కూడా అప్పీల్ చేయాలి. – స్పెషల్ పీపీ వై. కోటేశ్వరరావు

# ఇది రెడ్ బుక్ పాలన

- ఏపీలో వ్యవస్థలన్నీ కుప్పకూలిపోయాయి
- కృష్ణా జిల్లా వైఎస్సార్‌సీపీ నేతల సమావేశంలో వైఎస్ జగన్ మండిపాటు
- సంక్రాంతి తర్వాత పార్లమెంట్ నియోజకవర్గం యూనిట్‌గా జిల్లాల్లో పర్యటిస్తా
- 'కార్యకర్తలతో జగనన్న.. పార్టీ బలోపేతానికి దిశా నిర్దేశం' పేరుతో కార్యక్రమం



అబద్ధాలు చెప్పడం మనకు చేతగాదు. అతి నిజాయితీ, అతి మంచితనం మనకున్న సమస్యలు. కానీ రేపు మనమనుకుంటున్న ఈ సమస్యలే మళ్లీ మనల్ని అధికారంలోకి తెస్తాయి. ఆరు నెలలు తిరక్క మునుపే ఇవాళ పరిస్థితి చూస్తే.. ప్రతి ఇంట్లో ఒకటే చర్చ జరుగుతోంది. జగన్ కనీసం పలావు అయినా పెట్టేవాడు.. చంద్రబాబునాయుడు బిర్యానీ పెడతానన్నాడు.. తీరా చూస్తే పలావు పోయింది, బిర్యానీ పోయిందని చర్చ జరుగుతోంది. – వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: 'రాష్ట్రంలో ఎక్కడ చూసినా రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోంది. ప్రజలకు మంచి చేశాం కాబట్టి మాకు ఓటు వేయండి.. అని అడిగే పరిస్థితి టీడీపీకి లేదు. ఎక్కడ చూసినా వ్యవస్థలన్నీ కుప్పకూలిపోయిన పరిస్థితే కనిపిస్తోంది' అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. 'మన ప్రభుత్వానికి, చంద్రబాబు ప్రభుత్వానికి మధ్య ఇప్పటికే ప్రతి ఇంట్లో పోలిక మొదలైంది. మన ప్రభుత్వ హయాంలో ఎలా ఉండేది.. ఈ ఆరు నెలల్లో చంద్రబాబు ప్రభుత్వం ఎలా పని చేస్తోంది.. అన్న చర్చ ప్రతి ఇంట్లో నడుస్తోంది' అని స్థానిక సంస్థల ప్రజానిధులకు చెప్పారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలోని ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, మేయర్లతో సమావేశమయ్యారు. సంక్రాంతి తర్వాత పార్లమెంటు యూనిట్‌గా జిల్లాల బాట పడతానని, దాదాపు జనవరి ఆఖరు నుంచి 'కార్యకర్తలతో జగనన్న.. పార్టీ బలోపేతానికి దిశా నిర్దేశం' అనే పేరుతో ఈ కార్యక్రమాన్ని మొదలు పెడతానని చెప్పారు. ప్రతి బుధవారం, గురువారం జిల్లాల్లోనే ఉంటానని, ప్రతి పార్లమెంటును ఒక యూనిట్‌గా తీసుకుని అక్కడికి వచ్చి బస చేస్తానన్నారు. బుధవారం మూడు నియోజకవర్గాల కార్యకర్తలతో, గురువారం మరో నాలుగు నియోజకవర్గాల కార్యకర్తలతో మమేకం అవుతానని చెప్పారు. పూర్తిగా కార్యకర్తలకే సమయం కేటాయిస్తానని, అక్కడే ఉంటూ వారితో మమేకమవుతూ, వారికి తోడుగా ఉంటూ వారికి మరింత దగ్గరయ్యే కార్యక్రమం చేస్తానని తెలిపారు. 'గ్రామ స్థాయిలో కార్యకర్త నుంచి ఎమ్మెల్యే, ఎంపీ వరకు ప్రతి ఒక్కరికీ ఫేస్ బుక్, ఇన్‌స్టా, వాట్సాప్ ఉండాలి. ఎక్కడ ఏ అన్యాయం జరిగినా దాన్ని వీడియో తీసి అప్ లోడ్ చేయాలి. యూట్యూబ్‌లో కూడా పోస్ట్ చేయాలి. సంవత్సరం పూర్తయ్యే సరికి గ్రామంలో తెలుగుదేశం పార్టీని, చంద్రబాబును ప్రశ్నిస్తూ ప్రతి ఇంట్లోంచి వాయిస్ రావాలి. అది మనం చేస్తూ, మన కార్యకర్తలతో చేయించాలి. సూపర్ సిక్స్ ఏమైంది? ఏమైంది సూపర్ సెవన్? మాకు చెప్పిన మాటలు ఏమయ్యాయి? అన్న దగ్గర నుంచి మొదలయ్యే ప్రశ్నల వర్షం.. ఏమైంది మా స్కూల్? ఏమైంది మా హాస్పిటల్? ఏమైంది మా పంటల కొనుగోలు పరిస్థితి? ఏమైంది మా ఆర్బీకే? అంటూ ప్రశ్నల పరంపర కొనసాగాలి. ఆ దిశగా అడుగులు ముందుకు పడాలి' అని నిర్దేశించారు.

### బాదుడే.. బాదుడు
## ఇప్పుడు రూ. 9 వేల కోట్లు

- ఏపీ ప్రజలపై భారీగా విద్యుత్ చార్జీల భారం మోపుతున్న చంద్రబాబు... ఇదికాక ఇప్పటికే ఈ నెల బిల్లు నుంచి రూ.6,072.86 కోట్లు వసూలు
- ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో తాజాగా వడ్డన

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

**జిల్లా వార్తలు**

### ఉషా టోర్నీకి ఎంపిక


క్రీడాకారులతో డీవైఎస్ఓ, కోచ్

ఖమ్మం స్పోర్ట్స్: పంజాబ్‌లో జరగనున్న జాతీయ స్థాయి 24వ సబ్ జూనియర్ బాలబాలికల ఉషా టోర్నీకి ఖమ్మం జిల్లా నుంచి నలుగురు ఎంపికయ్యారు. ఖమ్మంకు చెందిన టి.సాయిభవ్యశ్రీ, జె.ప్రహర్షన్ పాల్, డి.వరెన్, వై.రిత్విక్ రాష్ట్ర జట్టులో చోటు దక్కించుకున్నారని కోచ్, ఉషా అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి.పరిపూర్ణాచారి తెలిపారు. డిసెంబర్ 1నుంచి జరగనున్న టోర్నీకి ఎంపికైన క్రీడాకారులను డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్ రెడ్డి శుక్రవారం అభినందించారు.

### జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణించాలి


సాయికిరణ్‌కు కిట్ అందజేస్తున్న పీఓ రాహుల్

భద్రాచలం: గిరిజన విద్యార్థులు జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో రాణించి ఈ ప్రాంతానికి పేరు తీసుకురావాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. పాల్వంచ మండలం రేగళ్ల తండాకు చెందిన సాయికిరణ్ ఇటీవల మంచిర్యాల జిల్లా గాంధారిలో జరిగిన రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో ప్రతిభ కనబర్చాడు. దీంతో జార్ఖండ్ రాష్ట్రంలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే జట్టుకు ఎంపిక చేశారు. ఈమేరకు సాయికిరణ్‌ను శుక్రవారం భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో అభినందించిన పీఓ రూ.10వే విలువైన హాకీ కిట్ అందచేశారు. ఈ కార్యక్రమంలో క్రీడల అధికారి గోపాలరావు, ఏఎస్ఓ నాగేశ్వరరావు, ఈఎంఆర్ఎస్ పీఈటీ మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులకు ఐఆర్

ఖమ్మంగాంధీచౌక్: ప్రభుత్వ రంగ సంస్థల్లోని ఉద్యోగులకు ఐదు శాతం మధ్యంతర భృతి(ఐఆర్) అమలుచేస్తూ రాష్ట్రప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2023 అక్టోబర్ 2న ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ ప్రకటించగా, ప్రభుత్వ రంగ సంస్థల్లోని ఉద్యోగులకూ ఐఆర్ అమలుచేయాలని కోరారు. దీంతో సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ఈసందర్భంగా ప్రభుత్వంతో పాటు ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు బాలకృష్ణ, జీవన్, గవ్వ రవీందర్ రెడ్డికి హౌసింగ్ కార్పొరేషన్ అసిస్టెంట్ ఇంజనీర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొగ్గుల వెంకట్రామిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# ఉర్సు ఉత్సవాలకు వేళాయె..


దర్గాలో కొలువుదీరిన నాగుల్‌మీరా

- ముస్తాబైన నాగుల్‌మీరా దర్గా మౌలా చాన్ చిల్లా
- ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్న సత్యనారాయణపురం
- ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల నుంచి తరలిరానున్న భక్తులు


ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన దర్గా ముఖద్వారం


నీతి వాక్యాలతో ఏర్పాటు చేసిన బోర్డులు

ఇల్లెందురూరల్: నమ్మిన భక్తుల కోర్కెలు తీర్చే దైవంగా.. మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్న ఇల్లెందు మండలం సత్యనారాయణపురం శివారు హజ్రత్ నాగుల్‌మీరా దర్గా మౌలా చాన్ చిల్లాలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. దర్గాలో శనివారం నుంచి ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా భక్తులు తరలిరానుండగా.. దర్గా ముస్లింలకు పవిత్ర స్థలమైనా హిందువులు అధిక సంఖ్యలో దర్శించుకుంటారు.

**22వ ఉర్సు ఉత్సవాలు**

హజరత్ నాగుల్‌మీరా దర్గాలో ఇప్పటివరకు 21 సార్లు ఉర్సు ఉత్సవాలను నిర్వహించారు. ప్రస్తుతం 22వ ఉర్సు ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నాగుల్‌మీరాను దర్శించుకునేందుకు ఉమ్మడి జిల్లాతోపాటు రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి భక్తులు వస్తారు. దీంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉత్సవ నిర్వాహక కమిటీ ఆధ్వర్యాన పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు.

**నాగుల పుట్ట**

సత్యనారాయణపురం గ్రామం నుంచి రెండు కి.మీ. దూరంలో నాగుల్‌మీరా దర్గా ఉంటుంది. దట్టమైన అటవీ ప్రాంతంలో వచ్చే భక్తులకు అండగా ఉండేందుకు నాగుపాము తిరిగేదని భక్తులు చెబుతారు. హిందువుల ఆరాధ్య దైవ్యమైన నాగేంద్రుడిని ముస్లింలు కూడా పూజించడం విశేషం. నేటికీ ఈ ప్రాంతంలో నాగుపాము సంచరిస్తుందని భక్తుల విశ్వాసం. అంతేకాకుండా ఇక్కడకు వచ్చేవారు ప్రత్యేకంగా నాగేంద్రుడి పుట్ట వద్ద మొక్కలు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

**ప్రశాంతత, సామరస్య స్ఫూర్తి..**

దట్టమైన అటవీ ప్రాంతంలో కొలువుదీరిన హజ్రత్ నాగుల్‌మీరా దర్గా ప్రాంగణం ప్రశాంతతకు నిలయంగా ఉంటుంది. దర్గా సమీపాన పెద్ద వృక్షాలతోపాటు దర్గా ప్రాంగణంలో రకరకాల పూల మొక్కలు, పక్షులు కనిపిస్తాయి. ఇక్కడ ఎలాంటి తాయెత్తులు అమ్మకపోగా, మంత్రించిన నీళ్ల చల్లడం, దర్శనానికి టికెట్లు అమ్మడం కనిపించవు. కానీ, నాగుల్‌మీర మహత్తుపై విశ్వాసం కలిగిన భక్తులు స్వచ్ఛందంగా వస్తు, ధన రూపేనా తోడ్పాటునందిస్తున్నారు. ప్రకృతి ఒడిలో మానసిక ప్రశాంతతను పొందే మార్గం చూపడమే ఈ దర్గా లక్ష్యంగా నిర్వాహకులు చెబుతున్నారు. ఇక్కడ సీతారాముల కల్యాణం, అయ్యప్ప ఇరుముడి, క్రిస్మస్ వంటి పర్వదినాలు నిర్వహిస్తుండటం మరోప్రత్యేకత. కాగా సత్యనారాయణపురం నుంచి దర్గా వరకు అడుగడుగునా మహనీయులు చెప్పిన నీతి వాక్యాలతో ఏర్పాటు చేసిన బోర్డులు కనిపిస్తాయి.

**అన్ని సేవలూ భక్తుల బాధ్యతే..**

హజ్రత్ నాగుల్‌మీరా దర్గా మౌలా చాన్ చిల్లా భక్తుల ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తోంది. దర్గాలో సాధారణ కార్యక్రమాలు, అన్ని మతాల పండుగలను సమష్టిగా నిర్వహించే భక్తులు ఉర్సు ఉత్సవాలను కూడా అదే స్ఫూర్తితో కొనసాగిస్తారు. ఎక్కడా కూలీల అవసరం లేకుండా ఎవరి పర్యవేక్షణ కనిపించకుండా భక్తులే బాధ్యతతో ఏర్పాట్లలో నిమగ్నమవుతారు. మహిళా భక్తులు సైతం రెండు, మూడు రోజులు దర్గాలోనే మకాం వేసి భక్తులకు అవసరమైన ప్రసాదం సిద్ధం చేస్తుంటారు.

**దావత్, ప్రసాదం**

దర్గాలో ఉర్సు ఉత్సవాల ముగింపు సందర్భంగా భక్తులకు ఉర్సు ఉత్సవ కమిటీ తరఫున ప్రసాదం ఉచితంగా పంపిణీ చేస్తారు. అలాగే, చివరి రోజున వేలాది మంది భక్తులకు భోజనం సమకూరుస్తారు. ఎక్కడా ఎవరి నుంచి కూడా చందా అడగకుండా భక్తులు ఇచ్చే సాయంతోనే నిర్వాహకులు ఈ ఏర్పాట్లన్నీ చేస్తారు.

**ఉర్సు ఉత్సవాల వివరాలివే..**

- శనివారం (నవంబర్ 30) : సాయంత్రం 5 గంటలకు హజ్రత్ ఖాసీం దుల్హా దర్గా నుంచి చాదర్ ప్రత్యేక వాహనంలో ప్రదర్శనగా బయలుదేరి నాగుల్‌మీరా దర్గాకు చేరుతుంది.
- ఆదివారం (డిసెంబర్ 1) : ఉదయం 9 గంటలకు హజ్రత్ ఖాసీం దుల్హా దర్గా నుంచి భారీ జులూస్‌గా నాగుల్‌మీరా నిశానీలతో బయలుదేరి సాయంత్రం నాగుల్‌మీరా దర్గాకు చేరుస్తారు.
- సోమవారం (డిసెంబర్ 2) : మధ్యాహ్నం 12 గంటల నుంచి, సాయంత్రం 6 గంటలకు సలామీ, రాత్రి 7 గంటల నుంచి ఖవ్వాలీ నిర్వహిస్తారు.

### సంస్థ పురోభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర కీలకం

పాల్వంచ: విద్యుత్ సంస్థల పురోభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర కీలకమైనదని కేటీపీఎస్ 7వ దశ సీఈ పి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఇటీవల ఎన్నికైన తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ 7వ దశ కార్యవర్గం శుక్రవారం బాధ్యతలు స్వీకరించింది. ఈసందర్భంగా 'ఏ' కాలనీలోని ఇంజనీర్ల అసోసియేషన్ హాల్ వద్ద మొక్కలు నాటిన అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో సీఈ మాట్లాడారు. విభాగాల్లో సమస్యలను యాజమాన్యం, ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు అసోసియేషన్లు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఎస్ఈ ఎం.శ్రీనివాసరావు, ట్రెజరర్ సంపత్‌తో పాటు బ్రహ్మాజీ, యాకూబ్, శ్రీకాంత్, మధుబాబు, రాజేష్, వెంకట్రావ్, అరుణ్ కుమార్, లక్ష్మి, రాజేష్, నాగరాజు, గణేష్ పాల్గొన్నారు.


అసోసియేషన్ హాల్ వద్ద మొక్క నాటుతున్న సీఈ వెంకటేశ్వరరావు

### వైభవంగా కార్తీక పూజలు

ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రాచలంలో భక్తులు కార్తీక మాసం చివరి శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానికులకే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తెల్లవారుజామునే గోదావరి తీరానికి తరలివచ్చి స్నానాలు ఆచరించారు. అనంతరం మహిళలు దొప్పలలో ఉసిరికాయలు ఉంచి దీపాలు వెలిగించి నదీ జలాల్లో వదిలారు. అంతేకాక తీరంలోని తులసి కొమ్మ నాటి దీపాలు వెలిగించారు. ఆ తర్వాత భద్రాచలం రామాలయంతో పాటు అనుబంధ ఆలయాలను సందర్శించి పూజలు చేయగా ఆలయాలు కిక్కిరిసిపోయాయి.

– భద్రాచలంటౌన్


గోదావరి నదిలో స్నానం చేస్తున్న భక్తులు


నదీతీరంలో దీపాలు వెలిగించి పూజ చేస్తున్న భక్తులు

### పదోన్నతులు సరే.. బదిలీలెప్పుడు ?

- కేటీపీఎస్‌లో 70మందికి పదోన్నతి
- కొందరికి ఇక్కడి స్టేషన్ల పరిధిలోనే పోస్టింగ్
- మిగతా వారి బదిలీల్లో జాప్యంపై అనుమానాలు


పాల్వంచలోని కేటీపీఎస్ కాంప్లెక్స్

పాల్వంచ: టీఎస్ జెన్‌కోలో పనిచేస్తున్న ఇంజనీర్లకు ఇటీవల పదోన్నతులు కల్పించారు. అయితే, బదిలీలు మాత్రం చేపట్టడం లేదని పలువురు ఇంజనీర్లు వాపోతున్నారు. వాస్తవానికి పదోన్నతులతో పాటే బదిలీలు చేపట్టడం ఆనవాయితీ. కానీ ఈసారి యాజమాన్యం అందుకు విరుద్ధంగా వ్యవహరించడం వెనుక ఆంతర్యమేమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పోస్టింగ్ కోసం ఇంజనీర్లు చేసే పైరవీల మాటున లాభపడాలనే ఉద్దేశంతో ఇలా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. పైరవీలకు దిగుతున్న వారిని పక్కన పెడితే మిగతా ఉద్యోగులకు పదోన్నతులు దక్కినా బదిలీ చేయకపోవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది.

**డీఈ కేడర్ వరకు ఇక్కడికక్కడే...**

జెన్‌కో వ్యాప్తంగా గత అక్టోబర్ 14వ తేదీన 205 మంది ఇంజనీర్లకు పదోన్నతి కల్పించారు. వీరిలో ఏఈ నుండి ఎస్ఈ వరకు పలు కేడర్ల వారు ఉన్నారు. ఇందులో కేటీపీఎస్ 5, 6వ దశల కర్మాగారంలో 40 మంది, 7వ దశ కర్మాగారంలో 30 మంది వరకు పదోన్నతి దక్కింది. ఏఈలకు ఏడీఈలుగా, ఏడీఈలకు డీఈలుగా, డీఈలకు ఈఈలుగా, ఈఈలకు ఎస్ఈలుగా పదోన్నతులు కల్పించారు. ఇదిలా ఉండగా డీఈ కేడర్ వరకు ఇక్కడి స్టేషన్ల పరిధిలోనే ఖాళీలను భర్తీ చేస్తూ స్థానచలనం చేశారు. వీరు మినహా ఏఈ, ఏడీఈ స్థాయి ఇంజనీర్ల బదిలీలు మాత్రం చేపట్టడం లేదు.

**పైరవీల బాట**

డీఈ కేడర్ మినహా మిగతా ఉద్యోగులకు పదోన్నతులు కల్పించినా బదిలీల విషయంలో కారణాలు ఏమిటో తెలియకున్నా జాప్యం జరుగుతోంది. దీంతో ఆయా కేడర్లలోని కొందరు ఉద్యోగులు తమకు అనుకూలమైన పోస్టింగ్ దక్కించుకునేందుకు పైరవీల బాట పట్టారు. ఇలా పైరవీలతో వచ్చే వారి ద్వారా లబ్ధి పొందాలనే ఉద్దేశంతో ఉన్నతాధికారులు ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. గతంలో ఎప్పుడైనా పదోన్నతులతో పాటు బదిలీ ఉత్తర్వులు విడుదల చేయడం ఆనవాయితీగా ఉండేది. కానీ ఈసారి అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తుండడంతో ఆరోపణలకు బలం చేకూరుతుండగా, ఇంజనీర్లు, సంఘాలు నాయకులు మాత్రం త్వరగా బదిలీల ప్రక్రియ పూర్తిచేయాలని కోరుతున్నారు.